# ఓటెత్తారు..

- ఓటు హక్కుపై వెల్లివిరిసిన చైతన్యం
- పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్‌కు దూరం
- పల్లెల్లో ఓటేసేందుకు బారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే సందడి
- తరలి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, కొత్త ఓటర్లు


ఆరేపల్లిలో ఓటు హక్కు కోసం క్యూలో ఓటర్లు


కామారెడ్డి పట్టణంలోని గంజ్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

నిజామాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ శాసనసభ ఎన్నికలకు గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు పెద్దసంఖ్యలో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**గ్రామాల్లో కళ కళ ... పట్టణాల్లో వెలవెల...**

ఉమ్మడి జిల్లా కేంద్రంలో విడ్డూరకర పరిస్థితులు కనిపించాయి. జిల్లా కేంద్రమైన నిజామాబాద్, కామారెడ్డిలో ఉదయం నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్ ముగిసే నాటికి పట్టణ ప్రజలు ఓటు వేసేందుకు కాసింత దూరంగా ఉన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడ చూసినా వెలవెలబోయిన పరిస్థితి. ఎక్కడా బారులు తీరినట్లు కనిపించకపోవడం శోచనీయం. నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పోలింగ్ శాతం నమోదైంది. విద్యాభ్యాసం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిలో చాలా మంది సొంతిళ్లకు రాకపోవడంతో వారి ఓట్లు నిష్ఫలమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం నడవ చేతకాని వృద్ధులు, దివ్యాంగులు సైతం భారీగా తరలి రావడం కనిపించింది. ఉదయం 7గంటలకే పోలింగ్ మొదలవ్వాల్సి ఉండగా అంతకు ముందే వృద్ధులు తమ ఓటు హక్కు కోసం వచ్చి వేచి చూసిన సందర్భాలు కూడా వెలుగు చూశాయి.

**పోలింగ్ శాతం నమోదు ఇలా...**

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో జిల్లా ఎన్నికల అధికారులు సాయంత్రం 5గంటల వరకు వెల్లడించిన పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 94వేల 902 మంది ఓటర్లున్నారు. వీరిలో ఓటేసింది 59.10 శాతం మంది మాత్రమే ఉన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 2లక్షల 53వేల 417 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 72.67 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 10వేల 341 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఓటేసింది 68.34 శాతం మంది ఓటేశారు. బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 21వేల 511 మంది ఉన్నారు. ఇక్కడ పోలింగ్ శాతం 71శాతంగా నమోదు అయ్యింది. బోధన్ నియోజకవర్గంలో 2లక్షల 20వేల 238 మంది ఓటర్లున్నారు. వీరిలో ఓటేసింది 68.05 శాతంగా తేలింది. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు లక్షా 95వేల 384 మంది ఓటర్లున్నారు. ఇక్కడ పోలింగ్ శాతం 73.68 గా నమోదైంది. ఇక కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షల 52వేల 620 మంది ఉన్నారు. వీరిలో ఓటేసిన వారు 68.94 శాతంగా ఉన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2లక్షల 20వేల 789 మంది ఓటర్లున్నారు. ఇక్కడ పోలింగ్ శాతం 83.16 నమోదైంది. జుక్కల్ నియోజకవర్గంలో 2లక్షల 100 మంది ఓటర్లుండగా 70.27 పోలింగ్ శాతం నమోదైంది. నిజామాబాద్‌లో 1549 కేంద్రాలు, కామారెడ్డిలో 791 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

## ఈ నగరానికి ఏమైంది ?

ఓటు అనేది పవిత్రమైన హక్కు మాత్రమే కాదు.. అది మాతృభూమి కోసం నిబద్ధతతో నిర్వర్తించాల్సిన బాధ్యత అని ప్రజాస్వామిక వాదులెంతో మంది చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఈ మహత్తర హక్కును వినియోగించుకోవడంలో నేటికీ కొద్ది మంది వెనుకడుగు వేస్తూనే ఉన్నారు. అక్షరాస్యత తక్కువ ఉండే పల్లెల్లో ఓటు చైతన్యం వెల్లివిరుస్తుండగా పట్టణ ప్రాంతాల్లో మాత్రం భిన్నంగా మారింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పల్లె ప్రాంతాల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. పట్టణాల్లో అంతగా ఓటర్లు ఇండ్లు దాటి బయటికి రాకపోగా మిగిలిన చోట్ల పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చి పోలింగ్ బూతుల్లో క్యూ లైన్లు కట్టారు. పట్టణాల్లో నివసిస్తున్న వారంతా ఇంటికే పరిమితం కావడంతో ఓటింగ్‌కు దూరంగానే ఉండిపోయారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ హోదా కలిగిన ప్రాంతాల్లోనూ ఓటు వేసేందుకు జనాలు బయటికి రాకపోవడం గమనార్హం. అయితే, పల్లె ప్రజలు మాత్రం ఉదయం 7గంటల నుంచే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు స్వచ్ఛందంగా తరలి రావడం విశేషం. ఓటు హక్కును వినియోగించుకోవడంలో గ్రామీణ ప్రాంత వాసులు చూపించిన చొరవను పలువురు అభినందిస్తున్నారు.

## కదిలివచ్చిన దివ్యాంగులు

ఓటు హక్కును వినియోగించుకునేందుకు దివ్యాంగులు సైతం పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో దివ్యాంగులకువలంటీర్లు దగ్గరుండి సేవలు అందించారు. వారిని వరుసలో కాకుండా నేరుగా పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లి ఓటు వేయించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. దివ్యాంగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు రావడంతో అభినందనలు వెల్లువెత్తాయి. వారి స్ఫూర్తిని అంతా మెచ్చుకున్నారు. మరోవైపు 18 ఏండ్లు నిండి తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీయువకులు పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందడంతో ఓట్లేసేందుకు వారంతా ఆసక్తి కనబర్చారు. తమ తల్లి దండ్రులతో కలిసి పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటును వినియోగించుకుని సంబురం వ్యక్తం చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవడంతో సమాజంలో బాధ్యతాయుతమైన పనిని పూర్తి చేశామన్న సంతృప్తిని పలువురు యువతీ, యువకులు వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఆదర్శవంతమైన బూత్‌గా తీర్చిదిద్దారు. ఆకట్టుకునే డెకరేషన్‌తోపాటు దివ్యాంగుల కోసం సులువుగా లోనికి వెళ్లేందురు ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. వారికి ప్రత్యేకంగా తేనీరు అందించారు.



# భారీ మెజార్టీతో గెలుస్తా..

- బీఆర్ఎస్ విజయం ఖాయం
- ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనది
- మంచి పరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలి
- స్వగ్రామం పోచారంలో ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి పోచారం


ఓటు వేసిన అనంతరం మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ రూరల్, నవంబర్ 30 : డిసెంబర్ 3న రాష్ట్ర ప్రజలకు ఎంతో పవిత్రమైన రోజని, ఐదేండ్లు తమను పాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే రోజని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని ప్రజలు తెచ్చిపెట్టనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాన్సువాడ నియోజవకర్గ అభ్యర్థిగా తనను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో పవిత్రమైనదని, ప్రజలకు మంచి పాలన అందించే నాయకులను ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధంగా పని చేస్తుందని పేర్కొన్నారు. గురువారం జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తన స్వగ్రామం పోచారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆనవాయితీని పాటిస్తూ సరిగ్గా ఉదయం 7 గంటలకు భార్య పుష్పతో కలిసి ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వేసే ఓటు తీర్పుతో తమను పాలించే నాయకులను, ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చని అన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

రాంపూర్, ఇబ్రహీంపేట్, బోర్లం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పోచారం పరిశీలించారు.



డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామంలో ఓటు వేసిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్


జుక్కల్ మండలం డోన్‌గావ్‌లో ఓటుహక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ షిండే, కుటుంబ సభ్యులు


భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న గంప గోవర్ధన్


లింగంపేట్ మండలం నల్లమడుగు గ్రామంలో ఓటు వేస్తున్న ఎల్లారెడ్డి అభ్యర్థి జాజాల

## ఓటు వేసిన ప్రముఖులు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు గురువారం పోలింగ్ నిర్వహించగా.. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు తమ కుటుంబసభ్యులతో తరలివచ్చి ఓటు వేశారు.


మహ్మద్‌నగర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు దంపతులు